# ఏది చవక?

నగధరం ఒక మహానగర నివాసి. ప్రొద్దుటే ఇంతన్నం తినేసి, టిఫిన్ బాక్సులో కొంత అన్నం కూరేసి బయలుదేరేవాడు ఆఫీసుకి. బస్సుల్ని పట్టుకుని వేలాడుతూ ఇల్లు చేరేసరికి రాత్రి అయిపోతూండడం వలన ఇంట్లోకి కావలసిన నిత్యావసర వస్తువుల్ని కొనుక్కుందికి తీరిక లేక చాలా ఇబ్బంది పడుతూండేవాడు. వీధిలో అమ్మకానికి వచ్చిన చచ్చు కూరల్లోనూ పుచ్చుకూరల్లోనూ కాస్త బావున్న వాటిని కొనడం నిత్యావసర వస్తువులు తెచ్చుకుందికీ క్యూలో నిలబడ్డం 'తేజస్విని' వంతైంది.

తేజస్విని ఓ ఏడాది క్రిందటే నగధరానికి అర్ధాంగి అయింది.

"రోజూ వీధిలోకి అమ్మవచ్చే సరుకులే కొనవలసి వస్తోంది. తాజా సరుకులు కొనుక్కుందికి వీలుకావడం లేదు. ఇవాళైనా మీరు మండీ బజారుకి వెళ్ళి తాజా సరుకులు తెండీ!" అని ఆదేశించింది తేజస్విని ఒక ఆదివారం రోజుని.

నగధరం సంచీ పట్టుకుని బయలు దేరేడు.

"ఆ చెప్పడం మరిచిపోయాను. మీకు బేరం ఎలాగూ చేతకాదు. ఇంకెవరైనా కొంటున్నప్పుడు వాళ్ళ పక్కనే నించుని, ఎంతకి కొంటున్నారో గమనించండి. డబ్బు దుబారా చేయకండి. డబ్బు బాగా పొదుపు చేస్తే అదే భవిష్యత్తుకు మదుపు అని రేడియోలో ఒకటే గోల! వింటున్నారా?" అని హెచ్చరించింది తేజస్విని.

"ఆ ఆ విన్నాను" అంటూ మెట్టు దిగిపోయేడు నగధరం.

నగదరం ఒక మతానికి చెందిన ప్రార్ధనా మందిరం ప్రక్కనుంచి వెళుతున్నాడు. వేరొక మతానికి చెందినవారి ఊరేగింపు ఆ తోవలోనే వెళుతోంధి.

"హోత్తేరీ! మా గుడిప్రక్కనుంచి మీ ఊరేగింపు వెళ్ళడమా?" అని మొదటి మతానికి చెందినవారు ఊరేగింపు జరుపుతున్న వాళ్ళతో ఘర్షణకి దిగేరు. ఉభయమతాల వారూ... చురకత్తులతో కసా కసా 'పొడి' చేసుకున్నారు. కొన్ని ప్రాణాలు అనంత వాయువుల్లో లీనం అయిపోయాయి. తెగిన నరాలతో కొన్ని శవాలు! ఆ నరాలతోనే 'వాయులీనం' అనే ఫిడేలు తీగలు తయారయాయా? అన్నట్లనిపించింది నగధరానికి. అక్కడ నిల్చిఉన్న ఒక లారీ కింద దూరి, ఎలాగో ప్రాణాలు దక్కించుకున్నాడు.

మండీ బజారుకి నడవడం కొనసాగించాడు నగధరం. కొంత దూరం నడిచేసరికి అక్కడ మరో దృశ్యం!

రెండు కులాల మధ్య సంఘర్షణ. సోడాబుడ్లు, సైకిల్ చెయిన్‌లూ 'ఫ్లయింగ్ సాసర్సు' లా ఎగిరేయి. నాటు బాంబులు, శివకాశీలో తయారైన బాంబుకన్నా పెద్ద శబ్దంతో పేలేయి.

జనాభా పెరుగుదలను అరికట్టమని ప్రభుత్వం ఘోషిస్తోంది. జనాభా తరుగుదల ఈ విధంగా అన్నమాట!

ఓ కిళ్ళీబడ్డీ ప్రక్క దాక్కుని ప్రాణాలు దక్కించుకున్నాడు నగధరం.

మళ్ళీ నడక ప్రారంభించాడు.

ఒక దగ్గర నిల్చిఉన్న ఒక ఆర్టీసీ బస్సు ప్రక్కగా నడుస్తున్నాడు నగధరం. ఒక కారులో కొందరు తీవ్రవాదుల ముఠావచ్చి, బస్సులో ఉన్న ప్రయాణికుల్ని విచక్షణా రహితంగా కాల్చి వేసి పారిపోయింది. మెడికల్ కాలేజి విద్యార్థులకి పాఠాలు నేర్పడానికి కొన్ని శవాలు లభ్యమయాయి. హంతకులు పారిపోయిన ఆర్నెల్లకి పోలీసు జాగిలాలు భౌ భౌ మన్నాయి.

నగధరం బితుకు బితుకు మంటూ ఎలాగో బయటపడి, మండీ బజారు చేరేడు. కావలసిన సరుకులు బేరం చేయకుండా సంచీనిండా వేసుకుని సందుల్లోంచి, గొందుల్లోంచి, అడ్డదారులు తొక్కి ఇల్లు చేరేడు.

ఏ సరుకులు ఏ ధరకి కొన్నారో వివరంగా చెప్పమంది తేజస్విని.

"రాతిరి మూషకంబు 'వివరం' బొనరించి" అన్న భర్తృహరి సుభాషితంలోని ధరల 'వివరం' చెప్పేడు నగధరం.

తేజస్విని జ్వాలాముఖి అయింది. ముఖంలో 'లావా' ప్రవహించింధి.

"నాకు తెలుసు మీకు బేరం చేతకాదని. ఓ రోజైనా రెస్టు దొరుకుతుందని మిమ్మల్ని వెళ్ళమనడం నాదే బుద్ధిపొరపాటు. ఇంత ప్రియంగా ఉన్న వస్తువుల్ని ఎందుకు తెచ్చేరు? చవకగా ఉన్న వస్తువుల్ని తెమ్మని గుమ్మం దిగేదాకా చెబుతూనే ఉన్నానే"! అని భర్తమీద నిప్పులు కురిపించింది తేజస్విని.

"ఆవేశపడకు ప్రియా! కాస్త నే చెప్పింది శాంతంగా విను. నేను కొంచెం దూరం వెళ్ళేసరికి రెండు మతాలవారు ఒకర్నొకరు పొడిచేసుకుని 'పొడి' చేసుకున్నారు. కొన్ని కళేబరాలు నేల కూలాయి.

...మరి కొంత దూరం వెళ్ళేను. అక్కడ నిల్చివున్న ఆర్టీసీ బస్సులోని ప్రయాణికుల్ని విచక్షణా రహితంగా కాల్చి చంపింది ఒక తీవ్రవాదుల ముఠా!

...తరువాత మండీ బజారు కెళ్ళేను. మండి బజారు అన్నందుకు ధరలు 'మండి' పోతున్నాయు.

...ధరను విడిచి చంద్రమండలం మీదికి వెళ్ళిన మానవుడు తిరిగి వస్తున్నాడు కాని, ధరను విడిచిన ధరలు మాత్రం తిరిగి రావడం లేదు.

...నువ్వేమో చవకగా ఉన్న వస్తువులే తెమ్మన్నావు. అన్నింటిలోకీ చవకగా ఉన్నవి 'మనుషుల ప్రాణాలే' అని తెలుసుకున్నాను. అవి తేవడం నాకు ఇష్టం లేక, నీకు కష్టమైనా గాని... ప్రియంగా ఉన్న వస్తువులే కొనుక్కొచ్చాను. నన్ను క్షమించు డియర్!" అన్నాడు నగధరం.

తేజస్విని తనలోని తేజం కోల్పోయింది!

వల్లకి వినూత్న వారపత్రిక 19-5-93